

ఉపాధి పనులు సక్రమంగా చేయండి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వేంపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు సక్రమంగా చేయించాలని, కూలీలకు సరిపడా వేతనం అందేలా చూడాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ పాండ్ పనులను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. అక్కడ సమీపంలో ఉపాధి ద్వారా నాటించిన చీనీ, సన్ననిమ్మ చెట్లను పరిశీలించారు. రైతులు తులసిబాబు, మురళిబాబుతో బిల్లులు సక్రమంగా వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పనిచేసే చోట కూలీలకు సరైన వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఆదిశేషారెడ్డి, ఆర్డీఓ చిన్నయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాల పెంపునకు కృషిచేయాలి

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదువుకున్న విద్యార్థులకు వీలైనంత ఎక్కువ మందికి ఉద్యోగాలు వచ్చేలా పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డైరెక్టర్ కుమారస్వామి గుప్తకు సూచించారు. ట్రిపుల్ ఐటీని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. డైరెక్టర్, ఏఓ ఇతర పరిపాలన విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. వసతులు, విద్యాప్రమాణాలు, ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాలు ఎక్కువ మందికి వచ్చేలా మరింత కృషిచేయాలని అధికారులకు సూచించారు.

ప్రేమికులను బ్లాక్‌మెయిల్ చేసే కానిస్టేబుల్ సస్పెన్షన్

● పలు ఆరోపణలపై మరొకరు కూడా..

కడప క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరిలో ఒకరు ప్రేమికుల జంటను టార్గెట్ చేస్తే మరొకరిపై అనేక ఆరోపణలు ఉన్నాయి.

కడప పోలీసుశాఖలోని జాగిలాల సంరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రామ్మోహన్‌రెడ్డి పాలకొండల్లో అనుచరులను పెట్టి ఒంటరిగా వెళ్లే ప్రేమికులను టార్గెట్ చేస్తుంటారు. అక్కడ ప్రేమికులు ఏకాంతంగా కనిపిస్తే అనుచరులు ఆ కానిస్టేబులుకు ఫోను చేసేవారు. వెంటనే ఇతను పోలీసు డ్రెస్‌లో అక్కడికి వెళ్లి వారి ఫొటోలు తీసేవారు. వాటిని చూపించి వారి వద్ద ఉన్న డబ్బు, బంగారు వస్తువులు లాక్కునేవాడు. అంతటితో వదలక వారి సెల్ నెంబరును తీసుకుని ఎప్పుడు డబ్బులు అవసరం అయితే అప్పుడు వారికి ఫోన్ చేసేవాడు. ఇటీవల అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ యువతిని డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ తను డబ్బులు ఇచ్చింది. అయినా అతను ఆ ఫొటోలను ఆ యువతి తల్లికి పోస్టు చేశాడు. దీంతో ఆ యువతి మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనలో రాజంపేట మన్నూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబులుపై కేసు నమోదు కావడంతో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పూర్తిస్థాయిలో విచారించారు. కానిస్టేబుల్ బ్లాక్‌మెయిల్ వ్యవహారం నిజం కావడంతో అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు.

పలు ఆరోపణలపై మరో కానిస్టేబుల్

ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సిద్ధారెడ్డి కడపలో పోలీసు సెలక్షన్ అకాడమీ నిర్వహిస్తున్నారు. దీంతో పాటు అతని పేరు, బంధువుల పేర్లతో వ్యాపారాలు చేయడంతో పాటు ఇటీవల జరిగిన పోలీసు సెలక్షన్‌లలో కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అవినీతికి పాల్పడ్డాడంటూ అతనిపై ఆరోపణలు వచ్చాయి. దీంతో అతడిని సస్పెండ్ చేశారు. కాగా సస్పెండ్ అయిన ఇద్దరు కానిస్టేబుళ్లు బంధువులు కావడం గమనార్హం.

మేయర్‌పై అనర్హత వేటుతో..
స్థానిక ప్రతినిధుల్లో వణుకు

● కార్పొరేషన్‌లో ముగ్గురు కార్పొరేటర్ల కాంట్రాక్టు పనులు?

● బద్వేలులో ముఖ్య నేతల కుటుంబీకుల పేరుతో రూ.కోట్ల పనులు

● 1955 యాక్ట్‌పై సర్వత్రా చర్చ


బద్వేలు మున్సిపాలిటీ

కడప గడపలో ఇప్పుడు 1955 యాక్టుపై బాగా చర్చ నడుస్తోంది. ఈ యాక్టు ఉన్నట్లు కనీసం ఇప్పుడున్న కార్పొరేటర్లకే తెలియదు. అలాంటి 1955 యాక్టును అధికారపార్టీ అస్త్రంగా వాడుకుంది. దీంతో మేయరు సురేశ్‌బాబు పదవికి ఎసరు వచ్చింది. కాంట్రాక్టు పనులు చేసింది కడప మేయరు సురేశ్‌బాబు కుటుంబం మాత్రమే కాదు.. జిల్లాలో పలువురు మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు కూడా పనులు చేశారని అంటున్నారు. మేయరు సురేశ్‌బాబుపై వేటుతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చేసిన పనులన్నింటిపైనా చర్చ నడుస్తోంది. దీంతో వీరందరిలోనూ భయం పట్టుకుంది.

(కడప-ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ప్రతినిధులైన కార్పొరేటరు, మేయరు, కౌన్సిలర్, చైర్మన్, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, ఎంపీటీసీ.. వీరెవరూ కూడా 1955 యాక్టు ప్రకారం కుటుంబ సభ్యుల పేరిట వాళ్ల పరిధిలో కాంట్రాక్టర్‌గా నమోదు చేసుకోకూడదు. అక్కడ పనులు చేయకూడదు. అయితే దీన్ని లెక్కచేయకుండా జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు పనులు చేపడుతున్నారు. కొందరు సబ్ కాంట్రాక్టులు తీసుకుని పనులు చేస్తే మరికొందరు ఏకంగా కుటుంబసభ్యుల పేరిటనే రిజిష్టరు చేసుకుని పనులు చేస్తున్నారు. మేయర్ సురేశ్‌బాబు తన సతీమణి జయశ్రీ, కుమారుడు అమరేశ్ పేరిట శ్రీవర్ధిని కన్‌స్ట్రక్షన్ స్థాపించారు. కార్పొరేషన్‌లో రిజిష్టరు చేసుకున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. దీంతో ఈయన పదవిపై వేటు పడింది.

మరో ముగ్గురు కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. కొంతమంది కార్పొరేటర్లు సబ్ కాంట్రాక్టు తీసుకుని పనులు చేస్తున్నారు. అయితే మేయర్ సురేశ్‌బాబుపై అనర్హత వేటు పడడంతో వీరంతా ఉలిక్కిపడ్డారు. దీంతో కార్పొరేషన్‌లో ఎంతమంది కార్పొరేటర్లు పనులు చేస్తున్నారనే చర్చ నడుస్తోంది. ముగ్గురు కార్పొరేటర్లు సొంత కుటుంబీకుల పేరిట పనులు చేశారని సమాచారం. ఏ కార్పొరేటరు ఏయే పనులు చేశారు అనే వివరాలు ఇంకా బయటికి రాలేదు. ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల మున్సిపాలిటీల్లోనూ పలువురు కౌన్సిలర్లు పనులు చేశారని అంటున్నారు.

భయం భయం

మాదే రాజ్యం మేం చెప్పిందే వేదం అంటూ వైసీపీ హయాంలో కొందరు విర్రవీగారు. అడ్డగోలుగా స్థానిక సంస్థలను దక్కించుకున్నారు. అడ్డంగా వ్యవహరించారు. వైసీపీ హయాంలో నిబంధనలు తుంగలో తొక్కారు. దీంతో కడప మేయర్‌పై అనర్హత వేటుపడింది. బద్వేలులో కోట్లాది రూపాయల పనులు జరిగాయి. ఇక్కడ టీడీపీ, వైసీపీ నేతల మ్యాచ్ ఫిక్సింగ్ ఉండడంతో బద్వేలు మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలు బయటికి రావనే చర్చ నడుస్తోంది. ప్రొద్దుటూరు, మైదుకూరుతో పాటు పోరుమామిళ్ల, వేంపల్లె, సీకేదిన్నె తదితర మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ ఆధ్వర్యంలో కుటుంబీకుల పేరిటనే పనులు చేపట్టారనే తెలుస్తోంది. వీరందరిలో ఇప్పుడు భయం నెలకొంది.

1955 యాక్టు గురించి తెలియదా..!

వైసీపీ హయాంలో నిబంధనలు ఏవీ పట్టించుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో వైసీపీ నేత ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీగా ఉంటే వారి కుటుంబీకుల పేరిటే పనులు చేసుకున్నారు. ఇప్పుడు మేయర్‌పై అనర్హత వేటుతో 1955 యాక్టుపై బాగా చర్చ నడుస్తోంది. వీరికి ఆ యాక్టు ఒకటి ఉంటుందని దాని ప్రకారం పనులు చేస్తే అనర్హత వేటు పడుతుందని తెలియదా.. లేక తెలిసినా తమను ఎవరు ఏం చేసుకోలేరన్న ధైర్యమా.. 1955 యాక్టు ప్రకారం మీరు పనులు చేయకూడదని అధికారులు చెప్పారా.. లేక చెప్పినా వినడంలేదా అన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.


బద్వేలులో వేసిన సీసీ రోడ్డు

బద్వేలు మున్సిపాలిటీలో..

శ్రీవిష్ణు శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ పేరిట బద్వేలు మున్సిపాలిటీలో రూ.100 కోట్ల వ్యయంతో 13 ప్యాకేజీలతో పనులు చేపట్టారు. శ్రీవిష్ణు శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టరుగా మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి ఆయన సతీమణి మమత, కుమారుడు శ్రీవర్ధనరెడ్డి పేరిట పనులు చేశారని చర్చ నడుస్తోంది. బద్వేలు మున్సిపాలిటీలో 35 వార్డులున్నాయి. జగన్ హయాంలో బద్వేలుకు ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ సందర్భంగా రూ.100కోట్ల పనులకు జగన్ భూమిపూజ చేశారు. ఈ పనులన్నీ బద్వేలు మున్సిపల్ చైర్మన్ కుటుంబమే చేసిందని సమాచారం. కడప మేయర్‌పై అనర్హత వేటు పడ్డంతో కోట్లాది రూపాయల పనులు జరిగిన బద్వేలు మున్సిపాలిటీపైనా చర్చ నడుస్తోంది. బద్వేలు మున్సిపాలిటీలో చైర్మన్ కుటుంబీకులు పనులు చేసింది వాస్తవమైతే.. కడప ఫలితమే ఇక్కడా రిపీట్ అవుతుందని అంటున్నారు. సుమారు రూ.40లక్షల పనులకే కడప మేయర్‌పై వేటు పడితే ఇక భారీస్థాయిలో చేపట్టిన బద్వేలులోని పనులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని చర్చిస్తున్నారు.

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం



కడప కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని అమ్మవారిశాల వీధిలోని కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో శుక్రవారం మహా కుంభాభిషేక కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శృంగేరి శారదాపీఠాధీశ్వరులు విధుశేఖర భారతీ మహాస్వామి విచ్చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో మహోత్సవాన్ని పూర్తిగావించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు అమ్మవారి ఆలయంలో శతచండీహోమం, కుమారి సువాసినీపూజ, కలశోద్వాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 9 గంటలకు మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు వైభవోపేతంగా సాగాయి. ఇదిలావుండగా కొన్ని శతాబ్దాలుగా కడప నగరంలో కొలువై భక్తుల నీరాజనాలు అందుకుంటూ విరాజిల్లుతున్న వాసవీమాత మహత్యం భక్తులకు తెలిసిందే. ఆ కోవలో 12 సంవత్సరాల క్రితం 2013 మార్చి 22న వాసవీ మాత నూతన దేవాలయంలో పునః ప్రతిష్ఠ మహాకుంభాభిషేక కార్యక్రమాన్ని శృంగేరి శారదాపీఠాధీశ్వరులు భారతీ తీర్థ మహాస్వామి చేతులమీదుగా నాడు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తిరిగి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రస్తుతం వాసవీ మాత మహా కుభాభిషేక మహోత్సవాన్ని విధుశేఖర భారతీ మహాస్వామి ఆధ్వర్యంలో పూర్తిగావించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహా కుంభాభిషేక మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం విచ్చే సిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహిం చారు.


మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న విధుశేఖర భారతీ మహాస్వామి

రుణాలు ఎప్పుడిస్తారు..?



● బీసీల్లో ముగిసిన లబ్ధిదారుల ఎంపిక

● ఎస్సీ మైనార్టీల్లో ఆగిన నమోదు ప్రక్రియ

● సంక్షేమ రుణాలకు తాత్కాలిక బ్రేక్?

ఆరు సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు, ఎస్సీలకు రాయితీ రుణాలు ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఎంతో కొంత ప్రభుత్వ సాయం అందిపుచ్చుకుని జీవనోపాధులు కల్పించుకోవాలని ఆశపడ్డారు. ఈ క్రమంలో భారీ సంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రుణాల మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను ఎమ్మెల్యేలు చేపట్టినట్లు తెలిసింది. దీంతో దళారీ వ్యవస్థ రంగప్రవేశం చేయడంతో కొంతకాలం పాటు ఈ ప్రక్రియకు బ్రేక్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.


బీసీ కార్పొరేషన్ సంక్షేమ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన బీసీలు (ఫైల్)

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 16(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం బీసీ కులాలతో పాటు వైశ్య, కాపు, కమ్మ, రెడ్డి, ఈబీసీలకు సంబంధించిన అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ కార్పొరేషన్ తరపున 16 యూనిట్లు ఉండగా, 486 మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన్ పరిధిలో 1,550 యూనిట్లకు 22,219 మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన్‌లో జనరిక్ మందుల షాపు నిర్వహణ కోసం 28 యూనిట్లకు 70 మంది, ఈబీసీ రుణాలకు 71 యూనిట్లకు 287 మంది దరఖాస్తు చేసుకున్నారు. కమ్మ కార్పొరేషన్ పరిధిలో 17 యూనిట్లకు 69 మంది, రెడ్డి కార్పొరేషన్ పరిధిలో 98 యూనిట్లకు 1,494 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాపు కార్పొరేషన్‌లో చంద్రన్న స్వయం ఉపాధి కింద 379 యూనిట్లకు 2,833 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ అధికార యంత్రాంగం ఇంటర్వ్యూలు నిర్వహించింది. 2,580 మందికి రుణాలు మంజూరు చేసినట్లు సమాచారం. మంజూరు పత్రాలను బీసీ కార్పొరేషన్ సంబంధిత బ్యాంకులకు అందించారు. బ్యాంకులు కూడా 1,119 యూనిట్లకు అనుమతించినట్లు తెలుస్తోంది. మరికొన్ని యూనిట్లకు సంబంధించి బ్యాంకుల పరిధిలో ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం.

ఎస్సీ మైనార్టీల్లో ఆగిన నమోదు ప్రక్రియ

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ చేపట్టారు. ఈ ప్రక్రియ ఈ నెల 20 నాటికి ముగియనుంది. అదే విధంగా మైనార్టీ కార్పొరేషన్ పరిధిలో ముస్లింల నుంచి రాయితీ రుణాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగా.. ఓబీఎంఎంఎస్ సైట్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఎస్సీ కార్పొరేషన్ బ్యాంకు లింక్డ్ రుణాల దరఖాస్తుల స్వీకరణకు బ్రేక్ పడిందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జి.రాజ్యలక్ష్మి తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలకు మించి దరఖాస్తులు రావడంతో సంబంధిత అధికార యంత్రాంగం కూడా దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంది. ఇంతలో సంక్షేమ రుణాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు సమాచారం. అయితే వేలాదిమంది సంక్షేమ రుణాలకోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు.

ఎమ్మెల్యేల మౌఖిక ఆదేశాలు..

అత్యధిక మంది రుణాలు దక్కించుకునేందుకు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. నాయకులు కూడా జిల్లా అధికారులకు కొన్ని పేర్లను సూచించడంతో అధికారులు సైతం నిస్సహాయ స్థితిలో ఉండిపోయారని అంటున్నారు. కొన్ని చోట్ల తాము సూచించిన వారికి రుణాలు ఇవ్వాలంటూ ఎమ్మెల్యేలు మౌఖికంగా ఆదేశించడంతో అధికారులు వారికే ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో రాయితీ రుణాలు కాబట్టి నియోజకవర్గ స్థాయి నాయకులకు చెప్పి ఒప్పించేందుకు కొంత ఖర్చవుతుందంటూ దిగువ శ్రేణి నాయకులు బేరసారాలు సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ తరుణంలో అన్ని రకాల సంక్షేమ రుణాలకు సంబంధించిన ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేయాలంటూ ఆదేశాలు అందాయని సమాచారం.

ప్రక్రియ పూర్తి చేశాం



బీసీ కార్పొరేషనుతో పాటు వివిధ కులాల కార్పొరేషన్లకు సంబంధించి రాయితీ రుణాల మంజూరు ప్రక్రియ మొత్తం పూర్తి చేశాం. లబ్ధిదారుల ఖాతాల వివరాలను కూడా రాయితీ విడుదలకు ప్రభుత్వానికి పంపించాం. అయితే అన్ని కార్పొరేషన్లకు ఒకేసారి రుణాలు విడుదల చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం కొంత వరకు సమయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇందుకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదు.

- జయసింహ, ఈడీ, బీసీ కార్పొరేషన్

మహానాడుకు ముమ్మర ఏర్పాట్లు

● పరిశీలించిన ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు



సీకేదిన్నె / కడప ఎర్రముక్కపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురంలో మహానాడుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం ఏర్పాట్లను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏమి చేయాలి, అందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి మ్యాప్‌ను పరిశీలిస్తూ.. సభాప్రాంగణం, పార్కింగ్ ప్లేస్, విద్యుత్తు ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. కడప జిల్లాలో మొట్టమొదటిసారిగా జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కృషి చేయాలన్నారు. సమయం తక్కువగా ఉండడంతో ఏర్పాట్లలో ఎటువంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనంతరం కడప ద్వారకానగర్‌లోని తన కార్యాలయలో ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహానాడు నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి నాయకుడిని కలుపుకుని మహానాడును విజయవంతం చేసేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ముందస్తు మహానాడు సభలు ఉంటాయన్నారు. అనంతరం మేయర్‌పై అనర్హత వేటుకు సంబంధించి ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు కాంట్రాక్టులు చేయకూడదని అయితే మేయర్ సురేశ్‌బాబు తప్పు చేశాడు, డిస్క్వాలిఫై అయ్యాడని అన్నారు. ఇందులో బాధ్యులైన కార్పొరేటర్లు కానీ, అధికారులు కానీ, కమిషనర్లను కూడా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బి.హరిప్రసాద్, ఎస్.గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

● నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

● ముద్దనూరులో రోడ్డుపై ప్రవహించిన పుల్లేరు వంక


7

కుక్క కడుపులో ఏనుగు పిల్ల?!

● చూసేందుకు ఎగబడిన జనం

6

కుక్క కడుపులో ఏనుగు పిల్ల?!

● చూసేందుకు ఎగబడిన జనం



బూచిపల్లెలో ఏనుగు ఆకారంలో పుట్టి మృతిచెందిన కుక్కపిల్ల

పెద్దతిప్పసముద్రం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏనుగు ఆకారంలో కుక్క పిల్ల జన్మించడంతో దానిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలోని బూచిపల్లెలో చోటుచేసుకుంది. సదరు గ్రామానికి చెందిన నరసింహులు పెంచుకుంటున్న ఓ కుక్క గురువారం మూడు కుక్క పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఓ పిల్ల ఏనుగు ఆకారంలో ఉండడం ఆసక్తి రేపింది. ఈ విషయం గ్రామంలో దావానంలా వ్యాపించడంతో చూసేందుకు జనం ఎగబడ్డారు. అయితే ఆ పిల్ల పుట్టిన కొద్దిసేపటికే మృతి చెందడంతో అంత్యక్రియలు చేశారు.

ఆలస్యంగా నరసాపూర్ - కదిరి ఎక్స్‌ప్రెస్

● నాలుగు గంటలకు పైగా ప్రయాణికుల అవస్థలు

ములకలచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): నరసాపూర్ నుంచి ములకలచెరువు మీదుగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఆలస్యంగా నడిచింది. నాలుగు గంటలకుపైగా ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాంకేతిక కారణాలతో ఈ రైలు చీరాలలో రెండు గంటలకుపైగా నిలిచిపోయింది. దీంతో ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 11.17 గంటలకు వచ్చింది. తిరుపతికి తెల్లవారుజామున 4.15కు రావాల్సి ఉండగా ఉదయం 8.17 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 5.39కి రావాల్సి ఉండగా 9.52కు, కలికిరికి తెల్లవారుజామున 5.54కు రావాల్సి ఉండగా ఉదయం 10.10కి, మదనపల్లె రోడ్‌కు ఉదయం 6.19కి రావాల్సి ఉండగా ఉదయం 10.39 గంటలకు వచ్చింది. కదిరికి ఉదయం 7.39 గంటలకు వెళ్లాల్సిన రైలు ఉదయం 11.49 గంటలకు వెళ్లింది. దీంతో ప్రయాణికులు స్టేషన్లలో గంటల తరబడి వేచి చూశారు. రైలులో ప్రయాణిస్తున్న వారు గమ్యస్థానాలకు చేరేలోగా చుక్కలు కన్పించాయి. ప్రతి రోజు ఈ రైలు నరసాపూర్ నుంచి ధర్మవరం వరకు నడుస్తుండగా ధర్మవరంలో ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కొన్ని రోజులుగా కదిరి వరకే నడుస్తోంది.

ఆలయాల అభివృద్ధే లక్ష్యం

● దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్

నిమ్మనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి దేవదాయ శాఖ ముఖ్య ఉద్దేశమని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. మండలంలో ఆ శాఖ ఆధ్వర్యంలో పునర్నిస్తున్న ఆలయాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తవళం గ్రామంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.17 కోట్లు కేటాయించగా, మొదటి విడతలో కోటి రూపాయల విలువపైన పనులు పూర్తయ్యాయన్నారు. రెండత విడత నిధులు త్వరలోనే మంజూరవుతాయన్నారు. బొంతవారిపల్లి వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు కాగా వాటి పనులు కూడా దాదాపు పూర్తయ్యాయన్నారు. అనంతరం రాచవేటివారిపల్లిలోని మృత్యుంజయ శివాలయంలో ధూపదీప కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని ప్రజల నుంచి వినతులు వచ్చాయన్నారు. పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మదనపల్లెఅర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. మదనపల్లె మండలం, బసినికొండ పంచాయతీ, పుంగనూరు బైపాస్ రోడ్డు, వై జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, మదనపల్లె డీఎస్పీ మహేంద్ర వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రోడ్డు భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మానపల్లెలో వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపిన మైనర్ల తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతి పోలీసు స్టేసన్ పరిధిలో సుమారు 200 మంది వాహనచోదకులపై కేసులు నమోదు చేశామన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయారాదని సూచించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం

గర్నిమిట్ట యల్లమ్మ

● నేటి నుంచి అమ్మవారి జాతర

● చాందినీ బండ్ల ఊరేగింపునకు పెట్టింది పేరు

పీలేరు, మే 16(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ అమ్మవారు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంలా విరాజిల్లుతోంది. కేవీపల్లె, గర్నిమిట్ట గ్రామాలకు గ్రామ దేవత అయిన యల్లమ్మ సంతాన ప్రదాయినిగా, విద్య, ఉద్యోగ, ఉపాధి మార్గాలను అనుగ్రహించే దేవతగా ఈ ప్రాంత ప్రజల నమ్మిక. కేవలం కేవీపల్లె మండలమే కాకుండా పొరుగున ఉన్న పీలేరు, సుండుపల్లె, సంబేపల్లె, కలకడ, కలికిరి, రొంపిచెర్లతో పాటు కర్నాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా అమ్మవారికి భక్తులు ఉండడం విశేషం. పీలేరు పరిసర ప్రాంతాల్లో అమ్మవారికి చాందినీ బండ్ల ద్వారా మొక్కులు తీర్చుకునే ఆచారం యల్లమ్మ జాతర ద్వారానే ప్రారంభం కావడం మరో విశేషం. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి అనంతరం వచ్చే ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి జాతర జరుగుతోంది. జాతరను ఘనంగా నిర్వహించేందుకు అటు భక్తులు, ఇటు ఆలయ నిర్వాహక కమిటీ పటిష్ట చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.





ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ అమ్మవారు, 300 ఏళ్లుగా పూజలందుకుంటున్న అమ్మవారి రాయి

ఆలయ చరిత్ర

గర్నిమిట్ట యల్లమ్మ ఆలయానికి 300 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వారి కథనం మేరకు సుమారు 300 ఏళ్ల క్రితం గర్నిమిట్ట కస్పాలో ఓ యాదవ కుటుంబం ఉండేది. వీరి పశువుల పాకలో ఆ ఇంటి యజమాని నిత్యం తన పశువులకు గ్రాసం వేసి మేపుకునేవాడు. ఆ క్రమంలో ఒకరోజు ఆయన పశుగ్రాసం గాటిలో ఓ నల్లటి రాయి కనిపించింది. ఏదో రాయి అనుకుని ఆయన దానిని తీసి పక్కన పడేశాడు. మరుసటి రోజు కూడా అదే రాయి అదే గాటిలో కనిపించడంతో మరలా పక్కన పడేశాడు. వారం రోజులు ఇదే తంతు కొనసాగడంతో ఆయన చిరాకు పడి ఆ రాయిని కోపంతో గోడ కేసి విసిరి కొట్టగా ఆ రాయి నుంచి రక్తం రావడంతో దానిని మాయగా భావించాడు. అదే రోజు రాత్రి ఆయనకు కలలో ఓ దేవత వచ్చి తాను రోజూ కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదని, తనను గ్రామదేవతగా కొలిస్తే గ్రామాన్ని చల్లగా కాపాడుతానని చెప్పింది. దీంతో ఆయన ప్రస్తుతం ఆలయం ఉన్న చోట ఆ రాయిని ప్రతిష్ఠించి పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి గ్రామస్తులు అమ్మవారిని కొలుస్తూ ప్రతి ఏటా జాతర నిర్వహిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆ యాదవ కుటుంబానికి చెందిన వారే పూజారులుగా కొనసాగుతున్నారు.



గర్నిమిట్ట యల్లమ్మ ఆలయం

చాందినీ బండ్ల ఊరేగింపునకు పెట్టింది పేరు

చెట్టు కింద చిన్న రాయిగా ప్రారంభమైన యల్లమ్మ వైభవం కాలక్రమంలో ఆలయంగా రూపాంతరం చెందింది. సంతానం, విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి అంశాల్లో నమ్మిన వారికి నమ్మినట్లు అనుగ్రహించడంతో గర్నిమిట్ట, కేవీపల్లెతో పాటు కేవీపల్లె మండల వ్యాప్తంగా అమ్మవారిపై ప్రజలకు భక్తివిశ్వాసాలు పెరిగాయి. అమ్మవారికి మొక్కుకున్న వారు తమ కోరికలు తీరిన అనంతరం కృతజ్ఞతగా జాతర సందర్భంగా చాందినీ బండ్లు కట్టడం ఆనవాయితీగా వస్తోంది. పీలేరు పరిసర ప్రాంతాల్లో చాందినీ బండ్ల వైభవం గర్నిమిట్ట జాతరతోనే మొదలైందని చెప్పవచ్చు. ఒకప్పుడు వందకు పైగా ఇక్కడ చాందినీ బండ్లు వచ్చేవి. ఇటీవల చాందినీ బండ్ల సంఖ్య తగ్గినప్పటికీ గత ఏడాది కూడా దాదాపు 50 బండ్లు వచ్చాయి. ఈ ఏడాది వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు తెలిపారు. కేవీపల్లె మండల వాసులే కాకుండా వ్యాపారం కోసం ఈ ప్రాంతానికి వచ్చిపోయే తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యాపారులు కూడా అమ్మవారి భక్తులుగా మారారని, జాతర కోసం వారందరూ తరలి వస్తారని గర్నిమిట్ట వాసులు తెలిపారు.

నేటి నుంచి జాతర

యల్లమ్మ అమ్మవారి జాతర శనివారం నుంచి సోమవారం దాకా మూడు రోజులపాటు జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు సురేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి జాగారం, ఆదివారం బోనాల సమర్పణ, రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు, సోమవారం మొక్కుబడుల చెల్లింపులు ఉంటాయని ఆయన వివరించారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రికార్డు డ్యాన్సులు, మోతాదుకు మించి డీజేలు ఉండకూడదని ఎస్ఐ చిన్నరెడ్డప్ప ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

వ్యాసరచనతో పిల్లల్లో సృజనాత్మకత : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన వల్ల పిల్లల్లో సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన పెంపొందుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను, మెమెంటోలను, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతి నెల మూడవ శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం థీమ్ బీట్ ద హీట్ అనే అంశంపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలను ఈ నెల 15న నిర్వహించామని, మొత్తం 24 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి రాయచోటి జడ్పీహెచ్ ఎస్ పాఠశాలకు చెందిన నికిత రెడ్డి, చిత్రలేఖనంలో మొదటి బహుమతి రాయచోటి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన భవ్య అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

భరతమాత కోసం దేశపౌరులందరూ సిద్ధం

● తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): భారతదేశం కోసం త్యాగాలు చేయడానికి దేశపౌరులందరూ సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్దఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లోకేశ్, జనసేన నాయకురాలు దారం అనిత పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైనికుల పోరాటపటిమతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మదనపల్లెకు గొప్ప పేరుందన్నారు. అలాంటి మదనపల్లెలో తిరంగా ర్యాలీ నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ మాట్లాడుతూ పౌరులందరు సురక్షితంగా ఉండాలని సరిహద్దుల్లో సైనికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారన్నారు. పీఎం నరేంద్రమోదీ, సైనికులకు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ ప్రభుత్వాస్పత్రి, బీసెంట్ సర్కిల్, బెంగళూరు బస్టాండు మీదుగా చిత్తూరు బస్టాండు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, యల్లంపల్లె ప్రశాంత్, భగవాన్, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మార్పురి శశిధర్‌నాయుడు, ఆర్‌కే రామకృష్ణాచారి, ఎస్ఏ మస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్, కలకడ వేణు, చిన్ని, బీజేపీ, జనసేన నాయకులు, పెద్దసంఖ్యలో మహిళలు త్రివర్ణ పతాకాలు చేతపట్టి పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు

విద్యుత్ స్తంభాలు అమర్చితేనే నిధులు

● వైఎస్ఆర్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్



ఎంఐజీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కడప జేసీ అదితిసింగ్

రాయచోటి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో ఉన్న ఎంఐజీ లే అవుట్‌లో విద్యుత్ స్తంభాలను ఎలాపడితే అలా కాకుండా సక్రమంగా అమర్చితేనే నిధులు మంజూరు చేస్తామని వైఎస్సార్ కడప జిల్లా జేసీ, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ వీసీ అదితిసింగ్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఆమె ఎంఐజీ లేఅవుట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న 298 ఇంటి స్థలాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై ఆరా తీసి లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించారు. అలాగే ఎంఐజీ లేఅవుట్ డ్రైనేజ్ సిస్టం సరిగ్గా లేదని, విద్యుత్ స్తంభాలు సక్రమంగా ఏర్పాటు చేయాల్సి ఉందని సంబంధిత అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. అలాగే రెండో విడత ఎంఐజీ లేఅవుట్‌కు సంబంధించిన నివేదికలను వీలైనంత త్వరగా పంపించాలని రాయచోటి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

పక్కా గృహాలు పూర్తి చేయండి : పీడీ

సిద్దవటం, మే 16 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజారత్నం తెలిపారు. మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్‌లో పక్కా గృహాల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌కేఆర్ నగర్‌లో 2019-20లో మంజూరైన గృహాలు త్వరగా నిర్మించడానికి కాంట్రిబ్యూషన్ కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ఒక్కొరికి రూ.50 వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తామని, నిర్మాణ పనులు జూన్ 10లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు. ఆయా జిల్లాల్లో సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై తరచూ సూచనలు, హెచ్చరికలు చేసినా వారిలో మార్పు రాలేదని, అందుకే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

డెంగీ వ్యాధిని ఓడిద్దాం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణలో భాగంగా 'మూడు పద్ధతులు పాటిద్దాం- డెంగ్యూను ఓడిద్దాం' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఉషశ్రీ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి డెంగ్యూ వ్యాధిపై అవగాహన కోసం పట్టణ పురవీధుల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ మూడు పద్ధతులు (పరిశీలించండి, శుభ్రపర్చండి, మూతలు పెట్టండి) పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధిని ఓడిద్దామని ప్రభుత్వం పిలుపునిచ్చిందన్నారు. ప్రస్తుతం డెంగ్యూ జ్వరాలు ఒక ప్రజా ఆరోగ్య సమస్యగా ఉందని, ప్రజల్లో చైతన్యం, అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ ఇంటి పరిసరాలు పాటించి నీటి నిల్వలు లేకుండా శుభ్రపర్చుకొని నీటి నిల్వలపైన మూతలు ఉంచాలని సూచించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నినాదాలు చేస్తూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ జాతీయ డెంగ్యూ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, ఆర్ఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ మహేశ్వర్‌రాజు, సీహెచ్‌వో నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్స్ బలరామరాజు, మహమ్మద్‌రఫీ, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

● కిసాన్‌మేళాలో ఎమ్మెల్యే, విప్ శ్రీధర్

రైల్వేకోడూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి వెన్నెముక అని జనసేన పార్టీ ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం ఆవరణలో కిసాన్‌మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యాన రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం ఇస్తుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులతో లాభాలను రైతులు పొందాలని, ఉద్యాన హబ్‌గా రైల్వేకోడూరును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం ఉద్యాన పంటలకు కేంద్ర బిందువుగా ఉన్నదని బ్రిటీష్ కాలంలోనే గుర్తించి 1935లోనే ఉద్యాన పరిశోధనా స్థానం ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుల సేవలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉన్నారని తెలిపారు. అలాగే ఇక్కడ జ్యూస్‌పరిశ్రమ కూడా ఏర్పాటు చేశారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని రైతులు మంచి నాణ్యమైన పండ్ల తోటలను సాగు చేసి లాభాలు పొందాలన్నారు. ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వేకోడూరు పండ్లతోటల సాగులో కాకుండా కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలను రైతులు పండిస్తున్నారని తెలిపారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులు అందిచేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయల ఉత్పత్తులు నాణ్యత ప్రమాణాలు బాగుంతటే ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తద్వారా రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. అలాగే విలువ ఆధారిత ఉత్పత్తుల పై రైతులు దృష్టి సారించాలన్నారు. రాయలసీమ జోన్ ఏడీఆర్ డాక్టర్ మధుమతి మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగులో ఖర్చు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ కేఎం యువరాజ్ మాట్లాడుతూ 1935లో ఏర్పాటైన ఉద్యాన పరిశోధన స్థానం 90 ఏళ్లు రైతుల కోసం విశిష్టమైన సేవలు అందిస్తుందన్నారు. నిమ్మ, బొప్పాయి, మామిడి తదితర వాటిపై పరిశోధనల్లో పురోగతి సాధించినట్లు తెలిపారు. పంటల సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలన్నారు. అనంతరాజుపేట అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన పరిశోధనను చేస్తున్నామని గుర్తు చేశారు. పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ ఆర్.నాగరాజు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పంటల సాగును రైతులు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీ కే.కవిత మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగుతో పాటు చిరుధాన్యాలు, నూనెగింజలు, పప్పు దినుసులు పంటలను సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్‌నాయక్, డాక్టర్ యోహాన్, డాక్టర్ వై.పుష్పావతి, డాక్టర్ జీ.రాజేశ్వరి, డాక్టర్ రూత్‌బెనర్జీ, డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ రామయ్య, డాక్టర్ గిరిధర్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ కె.లలిత, డాక్టర్ ముకుందలక్ష్మీ, డాక్టర్ వై.శిరీషా, డాక్టర్ వై.దీప్తికిరణ్, ఆదర్శ రైతులు బుర్రు సుబ్రహ్మణ్యం, వెంకట్రామరాజు, ఉంగరాల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉత్పత్తుల ప్రదర్శన

కిసాన్‌మేళా సందర్భంగా కూరగాయలు, పండ్లు, మొక్కలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, పప్పుదినుసులు, జీవన ఎరువుల స్టాళ్లు ఏర్పాటు చేశారు. 50 రకాల మామిడి కాయలు, పండ్లు, అరటి, సపోటా, జామ, నిమ్మ, బత్తాయి పండ్లు వివిధ రకాల కూరగాయలతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రారంభించారు. అన్ని స్టాళ్లను ఆయన తిలకించారు. శాస్త్రవేత్తలను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులను ఆయన అభినందించి ఉత్తమ స్టాళ్లకు బహుమతులు అందజేశారు.



50 రకాల మామిడి రకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్



వివిధ రకాల మామిడి మొక్కలను ప్రదర్శనలో ఉంచిన ఉద్యాన విద్యార్థులు

గాలివాన బీభత్సం

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ముద్దనూరులో రోడ్డుపై ప్రవహించిన పుల్లేరు వంక


కొండాపురంలో నెలకొరిగిన విద్యుత్‌స్తంభం

కొండాపురం/ముద్దనూరు/జమ్మలమడుగు/దువ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు నేలకూలాయి. కొండాపురంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో కొండాపురం, ఓబన్నపేట తదితర చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో పలు గ్రామాల్లో సుమా రు నాలుగైదు గంటలు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

ముద్దనూరు మండలంలోని కొండ ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో వంకలు ప్రవహించాయి. వేల్పుచర్ల, బడుగువారిపల్లె, దేనేపల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక, చెన్నారెడ్డిపల్లె సమీపంలోని వంక, వేల్పుచర్ల వద్ద వంక, అలాగే పలు వంకలు ప్రవహించాయి. పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక నీళ్లు రోడ్డుపై ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 13.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

జమ్మలమడుగులో అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జమ్మలమడుగులోని లోతట్టు ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిలిచింది. మోరగుడిలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా , మూడు రోడ్ల కూడలి కోవెలకుంట్లదారిలో, ఎత్తపువారి కాలనీలో తదితర చోట్ల భారీగా వర్షపునీరు నిలిచింది. అలాగే గ్రామాల్లో పలుచోట్ల గాలులకు చెట్లు విరిగిపడ్డాయి.


జమ్మలమడుగులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

దువ్వూరులో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో రైతులు అక్కడక్కడ ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. మండలంలో 22.4 మి.మీ. వర్షపాతం నమోదు అయింది. పలుచోట్ల రోడ్ల వెంట వర్షపునీరు నిలిచింది.


రోడ్డుపై ప్రవహిస్తున్న పుల్లేరు వంక


దువ్వూరు సమీపంలో తడిసిన ధాన్యం.. ఆరబోసుకుంటున్న రైతులు

గండికోట ప్రాజెక్టుకు అనుబంధంగా
కాలువల నిర్మాణం చేపట్టాలి


గండికోట ప్రాజెక్టును పరిశీలిస్తున్న రైతుసంఘం, సీపీఐ నాయకులు

కొండాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) గండికోట ప్రాజెక్టు నుంచి వామికొండ, సర్వరాయసాగర్ వంటి ప్రాజెక్టులకు నీటిని నింపడం వల్ల రైతులకు ఉపయోగం ఉండదని, రైతులు పంటలు పండించుకునే విధంగా ప్రధాన కాలువలు, పిల్ల కాలువల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమాలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం, సీపీఐ నాయకులతో కలిసి గండికోట ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం ప్రారంభించిన పిల్ల కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. గాలేరు-నగరి ప్రాజెక్టు మొదటిదశ పనులే అసంపూర్తిగా ఉన్నాయని, అందువల్ల రెండోదశ పను లు నగరి వరకు ఎన్నిరోజుల్లో పూర్తి చేస్తారో అంతుచిక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు. గండి కోట నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో, పునరావాసం కల్పించడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పరిహారాన్ని, పునరావాసాన్ని కల్పించాలని కోరారు. జిల్లా రైతు సంఘ సంఘం అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, రైతు సంఘం, సీపీఐ నాయకులు రామాంజనేయులు, మనోహర్‌బాబు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నారాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణం


శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న పద్మశాలీయులు, నారాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జమ్మలమడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం 6వ రోజు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దంపతులు, , జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి, బీజేపీ నాయకులు దేవగుడి శివనారాయణరెడ్డి, కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి పట్టణంలోని భద్రావతి, భావన్నారాయణ దేవస్థానం పద్మశాలీయులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పద్మశాలీయ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం శ్రీవారిని సర్వభూపాల వాహనంలో ఊరేగించారు. స్నపన తిరుమంజనం, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామి గజవాహనంలో దర్శనమిచ్చారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగం గా శనివారం రథోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముగ్గురు పీఆర్ ఇంజినీర్లకు ఇంక్రిమెంట్లు నిలుపుదల

కలికిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): గతంలో జమ్మలమడుగులో పనిచేసిన ముగ్గురు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లకు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రభుత్వ గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2016-17లో జమ్మలమడుగు మండలం పి.సిరిగేపల్లెలో ఎస్టీ, ఎస్సీ కోసం ఉపాధి హామీ పథకంలో వేసిన సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం బిల్లులు చెల్లించడంలో ఈ ముగ్గురు కనీస ప్రమాణాలు కూడా పాటించకపోవడంతో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం జరిగినట్లు 2017 జూలై 25న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి ఈ ముగ్గురిపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిగింది. అప్పట్లో క్యాసీ డీఈఈగా పనిచేసి ప్రస్తుతం ప్రొద్దుటూరు పీఆర్ఐ డీఈఈగా పనిచేస్తున్న టి. గోపాల్‌దాస్, ప్రస్తుతం కమలాపురం పీఆర్ఐ డీఈఈగా పని చేస్తున్న పి.వెంకటరావు, అప్పట్లో జమ్మలమడుగు ఏఈఈగా పనిచేసి ప్రస్తుతం అక్కడే ఇన్‌చార్జి డీఈఈగా కొనసాగుతున్న ఎస్.విజయభాస్కర్ రెడ్డిలను నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా విజిలెన్స్ గుర్తించి. పలు దఫాల విచారణ అనంతరం పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించడంలో వైఫల్యం, నియమాలను పట్టించుకోకుండా బిల్లులు చెల్లిండానికి ఈ ముగ్గురు పూర్తి బాధ్యులుగా ప్రభుత్వం నిర్ధారించింది. దుర్వినియోగమైన నిధుల రికవరీతో పాటు ముగ్గురికీ ఒక సంవత్సరం ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

ఎంపీడీఓపై విచారణకు ఆదేశం

పులివెందుల, మే 16 (ఆంధ్రజ్యోతి): తొండూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న కృష్ణప్రసాద్‌పై పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ విచారణకు ఆదేశించారు. గతంలో తొండూరు ఎంపీడీఓ చేసిన అక్రమాలపై ఈ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. 15వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించి రూ.22.65లక్షల నిధులు స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎంపీడీఓ అప్పటి కంప్యూటర్ ఆపరేటర్ చంద్ర ఓబులేస్‌లు కలిసి ఈ నిధులను స్వాహా చేసినట్లు తెలిసింది. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంలో కొంతమేర ఈ నిధులను ప్రభుత్వానికి ఎంపీడీఓ తిరిగి చెల్లించినట్లు సమాచారం. ఎక్కడ నిధులు దుర్వినియోగం అయ్యాయో అనే అంశంపై శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ పూర్తిస్థాయి విచారణ చేయాలని విచారణకు ఆదేశించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు విదేశీయులు

కడప క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీసుల అదుపులో ఇద్దరు విదేశీయులు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మొదట వీరు ఢిల్లీలో కూలి పనిచేశారు. అక్కడ నుంచి ఒక ఏజెన్సీ ద్వారా నంద్యాలకు వచ్చి అక్కడ పనిచేస్తూ రెండు నెలల క్రితం కడపకు వచ్చి ఐస్ అమ్ముతున్నారు. వీరి పాస్‌పోర్టు, వీసాపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిం చారు. కాగా పాస్‌పోర్టు సమయం ముగియడంతో వారి దేశానికి పంపేందుకు చర్యలు చేపట్టారు.

యువకుడిపై కేసు నమోదు

కలకడ, మే 16 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి యత్నించాడంటూ మణికుమార్(26) అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. కలికిరి మండలం అద్దవారిపల్లెకు చెందిన యువతి జాతర సందర్భంగా ఎర్రయ్యగారిపల్లెలోని తన మేనత్త ఇంటికి వచ్చింది. ఈ నెల 14న రాత్రి ఇంట్లో నిద్రిసున్న సమయంలో మేనత్త కుమారుడు మణికుమార్ ఆమెను భయభ్రాంతులకు గురి చేసి, లైంగిక దాడికి యత్నించాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదు

డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి


గండి గురుకుల పాఠశాలలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే విధుల నుంచి తొలగి స్తామని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. తొలుత గండి గురుకుల పాఠశాలలో ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్‌ను, మారెళ్లమడక గ్రామంలో గోశాల, గోకులం షెడ్లను పరిశీలించారు. అనంతరం రైతు సాగుచేసిన ఉద్యాన, అంతర్ పంటలను పరిశీలించి రైతుకు ఆదాయం ఎంత వస్తుందని ఆరా తీశారు. ఇటీవల మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని పత్రికల్లో వార్తలు రావడంపై ఆయన మండలించారు. పనులు కావాలన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ (ఎస్‌పీకేఎం) ఇండియన్ ఇనిస్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ఈ విద్యా సంవత్సరానికి హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ టెక్నాలజీలలో డిప్లమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌పీకేయం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎన్.గిరిధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం, మూడు సంవత్సరాల డిప్లమా కోర్సుతో పాటు డైరెక్టు 2వ సంవత్సరం (లాటరల్ ఎంట్రీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. వెంకటగిరిలో ఉన్న ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్నాటకలోని గడక్‌లో 4 సీట్లకు 3 సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సులో ప్రవేశం కోసం అవకాశాలున్నాయి. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కోర్సులకు పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై జూలై 1వ తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరిలకు 15 నుండి 23 సంవత్సరాలు మధ్య ఉండాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు 25 సంవత్సరాల్లోపు ఉండాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పులివెందుల, మే 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ప్రశాంత్‌కుమార్ (30) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... గత శనివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో కనంపల్లె సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద బైకుపై వెళ్తున్న ప్రశాంత్‌కుమార్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపేట గ్రామానికి చెందిన కందుల చంటి (31) అనే వ్యక్తి హత్యకు గురైన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను అరెస్టు చేసినట్లు ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, చక్రాయపేట ఎస్ఐ చంద్రశేఖర్‌లు తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. రాబడిన సమాచారం మేరకు బాలతిమ్మయ్యగారిపల్లె క్రాస్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

భార్యాభర్తలపై దాడి.. కేసు నమోదు

కొండాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పొట్టిపాడు గ్రామంలో భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటనలో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఓ వివాహిత రెండు నెలల నుంచి తనను పెద్దసూరి అనే వ్యక్తి ఫోన్‌లో లైంగికంగా వేధిస్తున్నాడని భర్తకు తెలిపింది. ఈ నేపథ్యంలో ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు శుక్రవారం భార్యాభర్తలపై పెద్దసూరి, అతని తమ్ముడు చిన్న సూరి దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

జమ్మలమడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగు మండలం గొరిగెనూరు గ్రామంలో ఈనెల 4వ తేదీ ఓ ఇంటిలో బంగారు వస్తువులు చోరీ చేసిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ హైమావతి, సిబ్బంది క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించి.. వాటి ఆధారంగా అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఇడుగూరు గ్రామానికి చెందిన దాసరి నరేంద్ర, దూదేకుల చిన్నబాషలను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐలు హైమావతి, రామకృష్ణలు తెలిపారు.

చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు


శ్రీదేవి భూదేవి సమేతంగా హంస వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

రాజుపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): వెల్లాల చెన్నకేశవ సంజీవ రాయస్వామి బ్రహ్మోత్సవాలు గత ఎని మిది రోజులుగా అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం 9వ రోజు చక్రస్నానం, వసంతోత్సవం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి హంసవాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు వసంతాలు చల్లు కుంటూ వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. తప్పెట్లు మేళ తాళాలతో మహిళల భజన సంకీర్తనల మధ్య వెల్లాలక్షేత్రం సమీపంలోని కుందూనది వద్దకు వైభవంగా సాగింది. అనంతరం సుదర్శన చక్రాన్ని అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నదీజలాలతో అభి షేకించారు. రాత్రి 7గంటల సమయంలో చెన్నకేశవ ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున ధ్వజస్తంభం వద్ద ఎగుర వేసిన గరుడ పతకాన్ని అవరోహణ చేశారు. కార్యక్రమంలో ఈవో కేవీ రమణ, కమిటీ సభ్యులు గంగిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, మండల టీడీపీ నాయకులు దుద్యాల సుబ్బిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్నం కిశోర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సీనియర్ అసి స్టెంటు రామ్మోహన్, అర్చకులు, పెపద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ బృందం తనిఖీలు


పశువైద్య కళాశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న వెటర్నరీ కౌన్సిల్ పరిశీలకులు

ప్రొద్దుటూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సహక్‌పూరేలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కళాశాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. కళాశాలలోని వివిధ విభాగాలను, పశు చికిత్సాలయం, పశుగణ క్షేత్ర సముదాయాలను పరిశీలించారు. అలాగే ల్యాబ్‌లు, లైబ్రరీ, క్రీడా విభాగాలను తనిఖీ చేశారు. విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించి కళాశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ చెంగల్వరాయలు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండి దేవస్థానాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయండి : కలెక్టర్


గండి ఆలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానం పనులు త్వరగా పూర్తిచేసి పునఃప్రారంభిం చాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన సహా య కమీషనర్ వెంకటసుబ్బయ్య, జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జునరావు, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, వేద పారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, గోపా లస్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరి త్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు. అంజన్న దర్శనం కోసం భక్తులు ఎదురు చూస్తున్నట్లు ఇది వరకు ఫిర్యాదులు వచ్చాయని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయాన్ని పునఃప్రారంభిం చేందు కు ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం చక్రాయపేట మండలంలోని తహసీల్దార్ కార్యాల యాన్ని తనిఖీ చేసి అక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులతో సమావేశం ఏర్పాటు చేసి నీటి సమస్యపై చర్చించారు. కార్యక్రమంలో గండి దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పాలక మండలి సభ్యులు, టీబీపీహెచ్‌సీఎల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వేంపల్లె తహ సల్దార్ హరినాథరెడ్డి, జడ్పీటీసీలు శివప్రసాద్ రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చక్రాయపేట ఎంపీపీ మాధవి బాలకృష్ణ, మారెళ్లమడక సర్పంచు నరసింహులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, తొండూరు శివమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలపై సెక్యూరిటీ ఆడిట్

కడప క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లాకోర్టు కాంప్లెక్స్ భవన సముదాయంలో చేపట్టవలసిన భద్రతా చర్యలపై శుక్రవారం స్టేట్ ఇంటెలిజెన్స్, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. భవన సముదాయంలో చేపట్టవలసిన భద్రతా చర్యలను పరిశీలించారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో అయినా ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. కొత్తగా ఏర్పాటు చేయాల్సిన సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ, ఇతర భద్రతా చర్యల నిమిత్తం కోర్టు ఆవరణంల ోతనిఖీ నిర్వహించారు. కోర్టుభవనం, సిబ్బంది, ప్రజల భద్రతను మరింత మెరుగుపరిచే ముందస్తులక్ష్యంతో దీనిని చేపట్టారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ సాయిరామ్, స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ సీఐ సుదర్శన్‌రెడ్డి, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కోర్టుమానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ కుమార్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంరాజు, అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి, ఎస్ఐ జీవన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషలో విద్యాబోధనతోనే వికాసం

కడప ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికస్థాయి నుంచి విద్యార్థులకు మాతృభాష మాధ్యమంలో విద్యాబోధన చేస్తే వారి సర్వతోముఖ వికాసం అవుతుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వు 21లో తొమ్మిది రకాల పాఠశాలల గురించి చెప్పారే గాని ఏ పాఠశాలలో కూడా తెలుగు మాధ్యమంపై ప్రస్తావనే లేదన్నారు. తెలుగు నేలపై తెలుగు మాధ్యమం లేకుండా పోతే భావితరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

'కూల్చిన కాశినాయన గుడిని కట్టిస్తారా.. మాటలతోనే సరిపెడతారా..?'

చెన్నూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : కాశినాయన మండలంలోని సద్గురు కాశినాయన ఆలయాన్ని ఇటీవల కాలంలో ఫారెస్టు సిబ్బంది కూల్చడంతో అక్కడ కూల్చిన స్థలంలో మరలా నిర్మాణాలు చేపడతామని నారాలోకేశ్ చెప్పడం జరిగింది. అయితే నిర్మాణానికి రూ.5లక్షలుమాత్రమే కేటాయించడం జరిగిందని, మిగతా నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారు. ఎప్పుడు పనులు చేపడతారని పీసీసీ డెలిగేట్ మెంబరు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. చెన్నూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోనే కాక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కాశినాయన అన్నప్రసాద కేంద్రాలున్నాయని ఎంతో మంది భక్తులు స్వామి పేరుతో అన్నప్రసాదం అంది స్తుంటారని అన్నారు. అలాంటి సద్గురువుకు మూలస్థానమైన కాశినాయన మండలం లోని కాశినాయన క్షేత్రంలోనే ఆలయానికిఫారెస్టు అధికారులు ఇది మాస్థలమంటూ కూల్చివేయడం శోచనీయమన్నారు. అలాంటి చోట తక్షణం పనులు చేపట్టాలని భక్తులు మనోభావాలు దెబ్బతీయకుండా చూడాలని ఆయన కోరారు.

'నిబంధనల మేరకే టెండర్లు వేశాం'

కడప,కలెక్టరేట్,మే 16,(ఆంధ్రజ్యోతి): జీఎల్టీ సంస్థ నిబంధనల మేరకే టెండర్లు వేయడం జరిగిందని, ఎస్సీ ,ఎస్టీల పేరుతో ఎటువంటి మోసాలకు పాల్పడలేదని ఆ సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించింది. ఈ నెల 11వ తేదీన ప్రచురితమైన ట్రాన్స్‌పోర్టు టెండర్లలో బినామీలు అనే కథనం అవాస్తమన్నారు. జీఎల్టీ సంస్థకు సురేష్‌కు ఎలాంటి సంబంధం లేదు ,కేవలం ఆరోపణలు మాత్రమే అన్నారు. అలాగే సురేష్ కూడా ఓ ప్రకటనలో వివరణ ఇస్తూ జీఎల్టీ సంస్థలో కానీ, ఇతర సంస్థల్లో కానీ తాను బినామీగా పని చేయడం లేదన్నారు. కాగా శుక్రవారం జీఎల్టీ సంస్థ, సురేష్ వేర్వేరు ప్రకటనలో ఖండించారు.

కాలువల్లో తీసిన వ్యర్థాలు తొలగింపు



చెన్నూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు అరుంధతీనగర్ వద్ద హైవేకి కుడి వైపు మురుగుకాలువలో చాలాకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలను తీసిన గ్రామ పంచాయతీ వాటిని చాలా రోజులుగా మురుగుకాలువ పక్కనే కుప్పలు తెప్పలుగా వేయడం జరిగింది. దీంతో ఆ వ్యర్థాలను తొలగించే విషయమై మూడురోజులక్రితం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో రెండురోజులపాటు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దీంతో పంచాయతీ ప్రజలు దోమల బారిన పడకుండా కొంత వరకు మేలు జరిగిందని ఆంధ్రజ్యోతిలో కథనం రాకపోతే ఎంత కాలమైనా వ్యర్థాలు అలాగే ఉండేవన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన డీసీసీబీ చైర్మన్



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న సూర్యనారాయణరెడ్డి

పులివెందుల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన బి.సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్సీ రామ గోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం పులివెందులలోని ఎమ్మెల్సీ నివాసంలో సూర్యనారాయణరెడ్డి కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా త్వరలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్సీ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు పరిమితులు, రైతులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలపై చర్చించారు.

తిలక్‌నగర్‌ను తిలకించండి

అడుగడుగునా గుంతల రోడ్లు ● కాల్వల్లేక రోడ్లపైనే మురుగునీరు ● ఇబ్బందుల్లో స్థానికులు

కడప క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : తిలక్‌నగర్ ఈ కాలనీ ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పడింది. ఇక్కడ ఎక్కువశాతం పేద మధ్య తరగతి వారే జీవనం సాగిస్తున్నారు. ఉదయం పనికి వెళితే సాయంత్రం తిరిగి వస్తారు. అయితే కాలనీ మాత్రం అకర్కడక్కడా సిమెంటురోడ్డు మినహాయిస్తే ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో సిమెంటు రోడ్లు కనిపించవు. మట్టి రోడ్లు అధ్వానంగా గుంతలమిట్టలతో దర్శనమిస్తున్నాయి. ఏళ్లతరబడి ఉన్న ఈ కాలనీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఎన్నికల సమయంలో పార్టీ నేతలు ఓట్ల కోసం వస్తారు కానీ అభివృద్ధిలో తమ కాలనీ వైపు ఎవరూ పట్టించు కోవడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడ కొన్ని కాలువలు పది అడుగులు, 15 అడుగులు ఉన్న కాలువలు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు పిచ్చి మొక్కలతో నిండిపోయి మురుగునీరు పారకుండా అక్కడ నిల్వ ఉంటుంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎండాకాలం కావడంతో స్థానికులు ఎక్కువగా ఆరుబయట పడుకుంటారు. అయితే దోమల దెబ్బకు స్థానికులు అల్లాడి తున్నారు. అయితే తిలక్‌నగర్‌లో ఓ రోడ్డులో అయితే ఏకంగా విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలోనే ఉండడంతో ఆటో,కార్లువెళ్లాలంటే ఇబ్బందులు పడక తప్పడంలేదు. దీనికి తోడు మురుఉగనీరు ఇక్కడ నిల్వ ఉంటుంది. ఇక పగలు రాత్రి తేడా లేకుండా విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నా వాటిని ఆర్పేవారు కరువయ్యారు. అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు, మురుగుకాల్వలు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుకుంటున్నారు.



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభం, రోడ్డుపై నిలిచి ఉన్న మురుగునీరు



ఇంటి ముందు నిలిచి ఉన్న మురుగునీరు

మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నాం



ఎప్పుడూ మా ఇంటి ముందు మురుగునీరు చెరువును తలపిస్తుంది. ఈ రోడ్డుపై ట్రాక్టరు, ఆటోలు తిరుగుతుండడంతో ఇంటి ముందున్న నీరు ఆ వాహనాల రాకపోకల వల్ల నీరు ఎగిరి మాపై పడుతోంది. అధికారులు స్పందించి కాల్వతో పాటు రోడ్డు వేయాలి.

నాగమ్మ,స్థానికురాలు

ప్రశాంత మనసుతో బస్సు నడపాలి

కడప మారుతీనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకులతో రోడ్డు పై బస్సును నడిపే సమయంలో ప్రతీ ఆర్టీసీ డ్రైవర్ కూడా ప్రశాంత మనసు, ఏకాగ్రత, సమయస్ఫూర్తితో వుండాలని ఓం శాంతి ప్రదీప అక్కయ్య సూచించారు. ప్రమాదాలు చేసిన ఆర్టీసీ ర్యాస్ డ్రైవర్లు, కంప్లయింట్ డ్రైవర్లు, క్రూ బీహేవియర్ కంప్లయింట్ సిబ్బందికి, డ్యామేజ్ డ్రైవర్లకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌సీఐ జావీద్, ఆర్టీసీ రీజనల్ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, 25 మంది ప్రమాదాలు చేసిన వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా పోతులరాజు ఊరేగింపు



చెన్నూరు, మే 16 (ఆంధ్ర జ్యోతి) : యల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా చెన్నూరులో శుక్రవారం పోతులరాజును ఊరేగించారు. వీధివీధినా తప్పెట్లతో పోతులరాజు ఉత్సవమూర్తిని తలపై ఉంచుకుని తిరగడం జరిగింది. వీధుల్లో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతేకాక ప్రతి యేటా వైశాఖ మాసంలో ఉత్సవాలు మూడురోజులుపాటు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా పోతులరాజు ఊరేగింపు నిర్వహించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సీకేదిన్నె, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చునని కీటక విభాగ శాస్త్రవేత్త పాండురంగ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్లలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను తెరిపించండి

వేంపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను సందర్శించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. వేంపల్లె పర్యటనకు వచ్చిన కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రైతు బజార్ నిర్మించి ఏడాది పూర్తవుతోందని, వృథాగా ఉందని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

'పార్టీ మారేవారికి మాట్లాడే అర్హత లేదు'



మాట్లాడుతున్న వైసీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తరపున గెలిచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లకు కనీసం మాట్లాడే అర్హత లేదని వైసీపీ కార్పొరేటర్లు, నేతలు మండిపడ్డారు. నిన్నటి వరకు వైసీపీ జపం చేసిన వారు నేడు టీడీపీలో చేరి ఆ పార్టీ జపం చేయడం హాస్యాస్పదంగా ఉందని శుక్రవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారుమాట్లాడారు. వైసీపీ నుంచి టీడీపీకి వెళ్లిన కార్పొరేటర్లు గత విషయాలు మరచి పోరాదన్నారు. మీరు ఏం ఆశించి టీడీపీలోకి వెళ్లారో అవసరం లేదని, తొలుత తమ పదవులకు రాజీనామా చేసి వెళ్లి ఉంటే సంతోషించేవారమన్నారు. వైసీపీ నేతలు జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, కార్పొరేటర్లు షఫి, రామ్‌లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పగడాలపల్లె గంగమ్మ తిరునాళ్లు

పెండ్లిమర్రి, మే 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పగడాలపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ తిరునాళ్లు శనివారం నుంచి జరగనుందని ఆలయ నిర్వాహకుడు గంగిరెడ్డి తెలిపారు. కోలాటం,బండలాగుడు పోటీలు,అన్న సంతర్పణ ఉంటాయని తెలిపారు.

23న గ్రామసభ ద్వారా రైతుల ఎంపిక

వీరపునాయునిపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ ద్వారా రైతుల ఎంపిక పూర్తి చేసి ఈనెల 23వ తేదీన ప్రణాళిక వేయడం జరుగుతుందని ఏపీఓ ఒక ప్రకటనలో తెలిపారు. హార్టికల్చర్ రైతులను గుర్తించడం కోసం శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. అందులో ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా పనులు గుర్తించి చేపట్టడం జరుగుతుందని ఏపీఓ తెలిపారు.

ప్రజలు చైతన్యవంతులైతేనే పారిశుధ్యం మెరుగు

శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ



ఫటాఫట్

పులివెందుల రూరల్,మే 16 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగుకు తమవంతు అన్ని చర్యలు చేపడుతున్నామని, అదే సమయంలో ప్రజలు చైతన్యవంతులైతేనే పారిశుధ్యం పూర్తి స్థాయిలో మెరుగుపడుతుందని ఎంపీడీవో పి.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పదోన్నతిపై ఇటీవల పులివెందుల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస రెడ్డితో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: పారిశుధ్యం మెరుగుకు ఎలా ముందుకెళ్తారు? అవగాహన కార్యక్రమాలు చేపడుతారా?

జవాబు: ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మొదట ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలి. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. పారిశుధ్యం మెరుగుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చనున్నాం.

ప్రశ్న: గ్రీన్‌అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు ఎప్పటికి చెల్లిస్తారు?

జవాబు: ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న వేతనాలు ఈనెల చివరికల్లా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: తాగునీటి, వీధిలైట్ల సమస్యలు ఉన్నాయా?

జవాబు: మండలంలో తాగునీటి సమస్య, వీధిలైట్ల సమస్య ఎక్కడా లేదు. ఒకవేళ వచ్చినా తక్షణం పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ముందుందుఎలాంటి చర్యలు తీసుకోనున్నారు.

జవాబు: పులివెందుల మండలంలోని ఆరు పంచాయతీలకు గాను ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వారు కూడా గ్రేడ్-5కి సంబంధించిన వారు. ఈ ముగ్గురు ఆరుపంచాయతీలలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు సాధ్యం అయ్యే పరిస్తితి కనిపించడం లేదు. గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-4 కింద ఇద్దరు, అడిషనల్ గ్రేడ్ -4 కింద ఇద్దరు కావాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్రశ్న: సిబ్బంది పనితీరు ఎలా ఉంది? వారికి మీరిచ్చే సూచనలుఏమిటి?

జవాబు: మొదట సమయపాలన పాటించాలని చెబుతున్నాం. ప్రజలకు మెరుగైన సేవలందించాలని చెబుతున్నాం. ఏదైన అవకతవకలు జరిగితే చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని చెబుతున్నాం.

రాజశ్యామలాదేవికి ప్రత్యేక పూజలు



చెన్నూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుష్పగిరిరోడ్డులో గోపవరం గ్రామ సమీపంలో కొలువై ఉన్న మాతంగి రాజశ్యామలాదేవికి శుక్రవారం విశేషమౌన అభిషేకాలు, పూజలు జరిగాయి. ప్రజలు అధిక సంఖ్యలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలాగే అన్నప్రసాద వితరణ చేశారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

లింగాల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా 25 రకాల పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఏవో రమేష్, ఉపాధి ఏపీఓ గంగరాజు పేర్కొన్నారు. లింగాల మండల వ్యాప్తంగా శుక్రవారం అన్ని గ్రామాలలో పండ్లతోటల సాగుపై రైతులకు అవాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సింహాద్రిపురం..: ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యాన పంటల సాగు లాభదాయకమని ఏవో శివమోహన్ రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని లోమడ గ్రామంలో ఉద్యాన సాగుపై గ్రామ స్థాయి సమావేశం నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సింహాద్రిపురం.. లోమడ గ్రామ సభలో మాట్లాడుతున్న ఏఓ శివమోహన్‌రెడ్డి

కమలాపురం రూరల్..: పండ్లతోటల పెంపకాన్ని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని పొడదుర్తి, లేటపల్లె గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు పండ్లతోటల పెంపకంపై ఎంపీడీవో జ్యోతి గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పొడదుర్తి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఏపీవో పార్థసారథి, అగ్రికల్చర్ అసిస్టెంట్ వికాస్, టీఏ.నరసింహారావు, ఎఫ్ఏ వినోద్, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

వల్లూరు..: ఉపాధి హామీ పథకం క్రింద పండ్ల తోటల పెంపకం చేయడం ద్వారా ఎంతో లాభదాయకంగా వుంటుందని పంచాయతీ విస్తరణ అధికారి శ్రీధర్, ఏపీఓ సుధారాణి అన్నారు. శుక్రవారం వల్లూరు మండలంలో పండ్ల తోటల పెంపకంపై అన్ని గ్రామ పంచాయితీలలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధిసిబ్బందితో పాటుగా స్థానిక రైతులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



వేంపల్లెలో డెంగీపై అప్రమత్తంల ఉండాలని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వేంపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని తాళ్లపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీప్రియ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినం పురస్కరించుకొని వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి దోమలు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. డెంగీ లక్షణాలు ఆకస్మిక జ్వరం, విపరీతమైన కండరాల కీళ్లనొప్పులు, వాంతులతో మొదలవుతుందని, ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటివి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరత్నం, హెచ్ఈ షఫీఉన్నీస, సూపర్‌వైజర్లు ఫక్రుద్దీన్, వెంకటలక్ష్మి, అరుణదేవి, అంకయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: ప్రతి శుక్రవారాన్ని డ్రైడే గా పాటించాలని నందిమండలం పీహెచ్‌సీ వైద్యుడు వినయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా శుక్రవారం గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్,సిబ్బంది రామ ప్రతాప్,మార్గరేట్, వెంకటసుబ్బమ్మ,అంజన,నీరజ,రుతూ,సుబ్బయ్య,రేష్మా,సుబ్బరావయ్య తదితరులు పాల్గొన్నారు.


సీకేదిన్నె..: దోమల మందు పిచికారీ చేయించుకోడం ద్వారా వాటిని నివారించవచ్చునని వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా శుక్రవారం చింతకొమ్మదిన్నెలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సునీత, సీహెచ్‌వో సుకుమార్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి మురళీధర్, ఈవోఆర్‌డీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: డెంగీ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజామొద్దీన్ అన్నారు. శుక్రవారం తొండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరిఫుల్లా ఆధ్వర్యంలో బొడెవారిపల్లె, మల్లేల గ్రామాలలో డెంగీ నివారణ దినం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సీహెచ్ఓ, సూపర్‌వైజర్,ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

కాశినాయన మే16(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగనపల్లె గ్రామంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో జయరాముడు,ఏవో జయలక్ష్మీ మాట్లాడుతూ సొంతభూమి కలిగిన రైతులకు ఉద్యాన శాఖద్వారా 29 రకాల పండ్లమొక్కలు అందజేయుటకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు ,ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు

ఇటుకులపాడులో శివాలయ ప్రతిష్ఠోత్సవాలు



ఇటుకులపాడులోని ముచుకుందేశ్వర జ్ఞాన ప్రసూనాంబ దేవాలయం

కాశినాయన మే16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకులపాడులో నూతనంగా నిర్మించిన శ్రీముచుకుందేశ్వర జ్ఞాన ప్రసూనాంబఆలయ ప్రతిష్ఠోత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో భాగాంగా చివరి రోజైన సోమవారం శివ పార్వతుల కల్యాణం జరుతుందన్నారు. ఈమూడు రోజులు అన్నదానం ఉంటుందన్నారు.

బండలాగుడు పోటీలు: ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమవారం సాయంత్రం బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఇందులో విజేతలకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.70వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.30వేలు,5వ బహుమతి రూ.20వేలు ,6వ బహుమతి రూ.10వేలు ఉంటాయన్నారు.

దుక్కులతో సాగుకు సన్నద్ధం





రాజుపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం కానుండడంతో రైతన్నలు దుక్కులు దున్ని పొలాలను సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. ఒక పక్క వేసవి ఎండలు మండుతుండగా మరో పక్క అరకొరగా అకాల వర్షాలు అక్కడక్కడ పడుతుండడంతో దుక్కులు మొదలుపెట్టారు. జూన్ మొదటి వారం నుంచి జూలై వరకు పంట పొలాలను చదను చేసుకోవడం ద్వారా పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ముందుగా వేసవి దుక్కులు దున్నడం ద్వారా పంట పొలాల్లో చీడపీడలు కూడా గుడ్లు పెట్టుకునే వాటిని నాశనం చేయడంతో పాటు వేసవి దుక్కులు పంట పొలాలకు బలం చేకూరుస్తుంది. గ్రామాల్లో ఉన్న పశువుల పేడ పంట పొలాలకు తోలుకుని రైతులు వాటిని చల్లుకుంటూ సన్నద్ధమవుతున్నారు. మరింత వర్షాలు పడితే ఈ పనులు ముమ్మరంగా సాగే విధంగా రైతులు నడుంబిగిస్తున్నారు. గత వారంలో పడ్డ వర్షానికి పంట పొలాల్లో దుక్కులు వస్తుండడంతో ట్రాక్టర్లు, ఎద్దుల ద్వారా తమ పొలాలను దున్నుకునేందుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది పత్తి పంట సరైన గిట్టుబాటు ధర లేక పోవడంతో పాటు వాతావరణం అనుకూలించక పంటను పూర్తిగా వదిలేసిన రైతన్నలు ఈ ఏడాది రుతు పవనాలు ముందే వస్తుండడంతో పత్తి పంట సాగు చేసుకునేందుకు రైతన్నలు ఆసక్తి కనపరుస్తున్నారు. సకాలంలో వర్షాలు పడితే ఎక్కువ శాతం మినుము, పత్తి, కంది సాగు చేసుకునేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు.

విత్తనాలు ఎరువులు అందించండి

గత ఏడాది ప్రభుత్వం కొత్తగా ఏర్పడడంతో విత్తనాలు ఎరువులకు కొంత మేర ఇబ్బంది పడ్డాం. ఈ సంవత్సరం సబ్సిడీతో విత్తనాలు ఎరువులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలుపుతుండడంతో సకాలంలో వాటిని అందిస్తేకాస్త మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా పంట సాగుకు అనుకూల పరిస్థితులు కనబడుతుండడంతో దుక్కులతో పొలాలను రైతన్నలు సంసిద్ధంచేస్తున్నారు.

వారంరోజుల్లో రోడ్డు విస్తరణ పనులు

పోరుమామిళ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనులు వారం రోజుల్లో తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సలీం తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్లలో ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ఆగిపోయిన రోడ్డు పనులు వారం రోజుల్లో ప్రారంభించేలా మెటీరియల్ సిద్ధం చేసుకోమని కాంట్రాక్టరుకు చెప్పామన్నారు. గతంలో ఉన్న అంచనాలతోనే రోడ్డు నిర్మాణం చేపడతారా? లేక మార్పులు ఏమైనా ఉన్నాయా? 80 అడుగుల వెడల్పుతో విస్తరణ పనులు ప్రారంభిస్తున్నారా అని విలేకరులు ప్రశ్నించగా ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ, ఈఈల సలహాలు తీసుకుని రెవెన్యూ అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. రోడ్డు పనులు మాత్రం వారంలో ప్రారంభిస్తామన్నారు.

కనకదుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



బద్వేలుటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో వెలసి ఉన్న కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వందలాది మంది మహిళలు కుంకుమార్చన చేశారు. మామిడిపండ్లతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శన మిచ్చారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు రాధాక్రిష్ణ ఆధ్వరంలో అన్నదానం నిర్వహించగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, అర్బన్‌సీఐ రాజగోపాల్, ఎస్ఐలు సత్యనారాయణ పాల్గొన్నారు.

రేకలకుంటలో పర్యటించిన ఆర్డీవో

బ్రహ్మంగారిమఠం ,మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకలకుంట గ్రామంలో శుక్రవారం ఆర్డీవో చంద్రమోహన్ పర్యటించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. డి. అగ్రహారంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజనరసింహ నరేంద్ర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహిదేవి పూజలు

ప్రొద్దుటూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం వారాహి దేవి పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీశక్తి పీఠం పీఠాదీశ్వరి మాతా రమ్యానందభారతిస్వామిని ఆధ్వర్యంలో ఘనంగా వారాహి పూజలు ప్రారంభించారు. శుక్రవారం వారాహిదేవి అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో సుహాసిని పూజ, లలిత పారాయణం చేశారు. శని, ఆదివారాల్లో వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు తెలిపారు. ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

పోరుమామిళ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) :బద్వేలులో జరిగే సీపీఐ జిల్లా 25వ ఏరియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ అన్నారు. శుక్రవారం మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు మేధావులు, కవులు, కళాకారులు, భజన బృందాలతో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు ముసుగులో బంగారు దొంగతనం

●ముగ్గురిని అరెస్టు చేసిన టూటౌన్ పోలీసులు

ప్రొద్దుటూరు , మే 16 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఉంగరాలు కొనుగోలు చేయడానికి వచ్చి దుకాణంలో నకిలి ఉంగరాలు పెట్టి బంగారు ఉంగరాలు దొంగలించిన కేసులో ముగ్గురు కిలాడీ లేడీలను టూటౌన్‌పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపిన వివరాల మేరకు మే 10 వతేదీన మెయిన్‌బజార్‌లోని దొంతి జూవెలర్స్‌లో ముగ్గురు మహిళలు వచ్చి ఉంగరాలు కావాలని వ్యాపారి ని బురిడీ కొట్టించి దుకాణంలోని బంగారు ఉంగరాలు తస్కరించి ఆ స్థానంలో నకిలీ ఉంగరాలు పెట్టి వెళ్ళారు.కానీ ఈ విషయం వ్యాపారి గుర్తించలేకపోయాడు. కానీ మే 14న ఆ ఉంగరాలు నకిలీవి గుర్తించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిసి ఫుటేజి అందజేశారు.దీంతో పోలీసులు సిసి ఫుటేజీ ఆదారంగా వారు పాత నేరస్థులుగా గుర్తించారు. ఆమేరకు శుక్రవారం ఆముగ్గురు కిలాడీ లేడీలను ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవి సర్కిల్లో పట్టుకుని రూ. 1.90,000 విలువ చేసే 20 గ్రాముల నాలుగు సాదా ఉంగరాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన ఈ కిలాడీ లేడీలలో కడప తారకరామ నగర్‌కు చెందిన చిన్నగాళ్ల రామాంజనమ్మ(42) , పోలా నాగవేణి (33), ఎర్రగుంట్ల టౌన్ వేంపల్లె రోడ్డులోని మన్నూరు లక్షుమ్మ (47) వున్నారు.వీరిలో కడప కు చెందిన ఇద్దరు మహిళలలో ఒకరి పై రెండు కేసులు మరొకరిపై 6 కేసులు వున్నట్లు పోలీసులు తెలిపారు.

మత్స్య సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికల అధికారి నుంచి నియామకపత్రం అందుకుంటున్న నూతన అధ్యక్షుడు చెన్నయ్య

బద్వేలు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యసహకార సంఘం నూతన అద్యక్షుడుగా కందుకూరు చిన్న చెన్నయ్యతో పాటు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక బెస్తవీధిలో ఉన్న బెస్త కమ్యూనిటీ హాలులో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా బోలా నారాయణ, వైస్ ప్రెసిడెంటుగా రొయ్యల క్రిష్ణ, సెక్రటరీగా నాగేటి రవి, డైరెక్టర్లుగా కనేకంటి శ్రీనివాసులు, కగ్గర శ్రీను, బోలా కుమార్, జింకా పెంచలయ్య, బోయన రాముడు, బోయన సుబ్బయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు బోలా నారాయణ మాట్లాడుతూ మత్స్య సహకారసంఘం అబివృద్ధికి కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకుఇంచిన మత్స్యకారులకు ధన్యవాదాలు తెలిపారు., ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా మత్స్యశాఖ సీనియర్ ఇన్‌స్పెక్టరు ఎం.ఉమాశంకర్ వ్యవహరించారు.

ఆర్యవైశ్యులకు ఘనసన్మానం

కలసపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలానికి చెందిన ఆర్యవైశ్యులకు శుక్రవారం కడపలో ఘన సన్మానం జరిగింది. కడపలో జరిగిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వర అమ్మవారి కుంభాభిషేకంలో కలసపాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కామిశెట్టి సుదర్శన్, గొంట్లా రామాంజనేయులు, కోశాధికారి వెంకటసత్యనారాయణ, జక్కా సుధాకర్, శ్రీహరి పూర్ణచంద్రరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని అక్కడి ఆర్యవైశ్యులు సన్మానించారు.

ఆక్రమిత స్థలాల పరిశీలన

పోరుమామిళ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చిన్నాయపల్లె గ్రామానికిసంబంధించి వాగుకు వెళ్లే దారి ఆక్రమణకు గురైందని గామస్థులు తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని గుర్తించి వాటికి హద్దులు ఏర్పాటు చేశారు. ముందుగా తహసీల్దారు ఆ ప్రాంతానికి రాక ముందు సర్వేయర్లు కొలతలు వేసేందుకు వెళ్లగా ఓ మహిళ మరో ఇద్దరు వ్యక్తులు అభ్యంతరం తెలిపారు. ఈ చెరువుకు సంబంధించి ఆక్రమణకు గురైన ప్రాంతాలన్నీసర్వే చేసి తరువాత తామున్న ప్రాంతంలోకి రావాలని లేదంటే ఒప్పుకునే ప్రసక్తి లేదని, పురుగు మందు తాగడానికైనా సిద్ధమని డిమాండ్ చేశారు. దీంతో వారికి సిబ్బంది సర్ది చెప్పి సర్వే నిర్ణయించారు. తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి వచ్చిన తరువాత ఆక్రమణలకు గురైనప్రాంతంలో హద్దులు ఏర్పాటు చేసి వివాదాలకు వెళ్లవద్దని వారిని వారించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బద్వేలుటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని వల్లెలవారిపల్లె గ్రామానికి చెందిన సుదీర్, బద్వేలు పట్టణం బ్రాహ్మణ వీధికి చెందిన మహేష్ అనే ఇద్దరు స్నేహితులు. శుక్రవారం ఓ పని నిమిత్తం వారిద్దరూ ద్విచక్రవాహనంలో వెలుతుండగా కదిరినాయుడుపల్లె బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు 108 ద్వారా బద్వేలు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు



చాపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులో శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామస్థులు అడ్డుకున్నారు. తిప్పిరెడ్డిపల్లె, కల్లూరు గ్రామాల మధ్య పెన్నానది నుంచి కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 30 ట్రాక్టర్ల ద్వారా చాపాడు మీదుగా మైదుకూరు, దువ్వూరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌ను రూ.4 వేలకు విక్రయించి సొమ్ము సంపాదించుకుంటున్నారు. ఇసుకను చాపాడు మీదుగా తరలించవద్దని ట్రాక్టర్ డ్రైవర్‌తో గంటసేపు గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు.

శ్మశానవాటికల్లో మౌలిక వసతులు ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం, మే 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు ఏర్పాటుకు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా మొదటి సారిగా పైలెట్ ప్రాజెక్టు కింద మోడల్‌గా ప్రతి మండలం నుంచి ఐదు శ్మశాన వాటికల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాల మేరకు సోమిరెడ్డిపల్లె ఓసీ, ఎస్సీ శ్మశాన వాటికల్లో టీడీపీ మండల నాయకుడు ఎల్లటూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో కంపచెట్ల తొలగింపు చేపట్టారు.

డెంగీ జ్వరం పట్ల అప్రమత్తంగా ఉండాలి



డెంగీ జ్వరంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మానవహారం చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



చౌటపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు/టౌన్/రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) :దోమల ఉత్పత్తికి నెలవైన నీటి నిల్వలు ఇంటి పరిసరాల్లో లేకుండా చేసి డెంగీ జ్వరం రాకుండా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలోని దేవాంగపేట ,శ్రీరాముల పేట,లైట్‌పాలెం హెల్త్ సెంటర్ల వైద్యులు సిబ్బంది ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వచ్చిన వారు తీవ్ర మైన జ్వరం తలనొప్పి కీళ్ల నొప్పులు డీహైడ్రేషన్ నీరసం లక్షణాలుఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యుని పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలన్నారు. పగటి దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అలీందౌలా, డాక్టర్ భరత్, డాక్టర్ మౌనిక, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెఈవో సుబ్బరాయుడు పాల్గొన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవంను పురష్కరించుకుని వైఎంఆర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిలువ తొట్లను శుభ్రం చేయడం, మూతలు పెట్టడం ద్వారా డెంగీ జ్వరాన్ని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పరిశుభ్రత పాటించడం ద్వారా డెంగీని దూరం చేయవచ్చని వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కామనూరు, చౌటపల్లెలో ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, సీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



డెంగ్యూవ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బద్వేలులో:ఏడీస్ ఈజిప్ట్ అనే ఆడదోమ కుట్టినపుడు డెంగీవ్యాధి కలుగుతుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ఏపీ ఎన్‌జీవో హోమ్‌లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన సమావేశంనిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్, గోపవరం వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, గాంధీనగర్ డాక్టర్ శరత్‌చంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా మాట్లాడుతూ ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్లనొప్పులు లక్షణాలు ఉంటే వెంటనే వైద్య చికిత్సలు తీసుకోవాలన్నారు. అనంతరం జమ్మలమడుగు పట్టణంలోని కన్నెలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , మోరగుడి, నాగులకట్ట ఆరోగ్య కేంద్రాల వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరంలో: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని డెంగీ జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని మైలవరం డాక్టర్లు పృధ్వీ, లక్ష్మీప్రసన్నలు తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురష్కరించుకుని మైలవరంలో ర్యాలీ నిర్వహించి డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ప్రతి ఒక్కరు దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి ఆయేషా సుల్తాన్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. డెంగీ లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రీతి, సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్లు క్రిష్ణవేణి, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కబ్జాపై చర్యలు తీసుకోండి

●తహసీల్దారుకు మాజీ సైనికుడి వినతి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న మాజీ సైనికుడు పేట్ల రవికుమార్

ప్రొద్దుటూరు , మే 16 (ఆంధ్ర జ్యోతి) : సైనికుడిగా పనిచేసి రిటైర్ అయిన డబ్బులతో సొంత ఇంటి నిర్మాణంకోసం కొత్తపల్లె పంచాయతీ లోని సర్వేనెంబరు 509/1లో 8 సెంట్లు స్థలం కొనుగోలు చేయగా కొందరు స్థలం కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారని మాజీ సైనికుడు పేట్ల రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు గంగయ్యకు మాజీ సైనికుడి కుటుంబం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి స్థలం కొన్నాక హద్దులు పాతుకొని ఉండగా జరీనా బేగం అనే మహిళ 56 సెంట్ల మొత్తం స్థలం మాదని ఇది మాజీ ఎమ్మెల్యే కుమారుడు కు విక్రయించామని తెలిపిందన్నారు. స్థలం అమ్మిన వారిని నిలదీయగా వారు ఇది పెద్దల చేతుల్లోకి పోయిందని తామేమి చేయలేమని మమ్ముల్ను వారు మోసం చేశారని ఇలా కబ్జా చేస్తున్న వారిపై విచారించి చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని తహసీల్దారును కోరారు. తహసీల్దారుకు వారు కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు అందజేశారు. ఇందుకు తహసీల్దారు విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి



కమిషనర్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి జమ్మలమడుగు నగర పంచాయతీ కాదని, మున్సిపాలిటీయేనని గ్రేడ్-3గా మారిన ప్రజలపై పన్నుల భారం పడదని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయం వద్ద కమిషనర్ వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అనేకమార్లు మున్సిపల్ శాఖ మంత్రిని కలిసి జమ్మలమడుగు అభివృద్ధిపై విన్నవించడం జరిగిందన్నారు. ఆ దిశగా జమ్మలమడుగు గ్రేడ్-3గా ఏర్పాటు చేశారన్నారు. భవిష్యత్తులో జమ్మలమడుగు మున్సిపాలిటీ గ్రేడ్-2లో వస్తుందని, దాంతో మరింత అభివృద్ధి, సేవలు పెరుగుతాయన్నారు. శ్రీనివాసులరెడ్డి, తోళ్లమడుగు ఖాదర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వం లేకుంటే చైర్మన్ అయ్యేవాడివా..!'

మైదుకూరు రూరల్ ,మే 15(ఆంధ్రజ్యోతి) :గత మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టే నువ్వు చైర్మన్ అయ్యావు అని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేయడంపై రఘురామిరెడ్డి మాట్లాడుతూ చంద్ర పార్టీ బీఫాం ఇవ్వకుంటే మున్సిపల్ ఎన్నికల్లో గెలవగలవా అని ఎద్దేవ చేశారు. రాజకీయం అంటే వ్యాపారం కాదు, ప్రజలకు సేవ చేయడం అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'ఒకరు వైకుంఠం.. మరొకరు కైలాసం చూపిస్తున్నారు'

జమ్మలమడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కైలాసం చూపిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం జమ్మలమడుగులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ కూటమి దొందు దొందేనన్నారు. రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త సింగం శివమోహన్‌రెడ్డి, పాముల బ్రహ్మానందరెడ్డి, పూల నజీర్, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.